క్లుప్తంగా

మానసకు మంత్రి అభినందన



మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను సన్మానించిన మానస, తదితరులు

తలకొండపల్లి: ఎస్‌ఐగా ఎంపికైన మానసను మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అభినందించారు. గౌడసంఘం ఆధ్వర్యంలో శనివారం మానస హైదరాబాద్‌లో శ్రీనివాస్‌గౌడ్‌ను కలిశారు. మంత్రిని శాలువాలతో సన్మానించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ లక్ష్యాన్ని సాధించడం కోసం విద్యార్థులు కృషి చేయాలన్నారు. మానస ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో గౌడసంఘం మండల ఉపాధ్యక్షుడు స్వామిగౌడ్, ఎంపీపీ నిర్మలాశ్రీశైలంగౌడ్, కుమార్‌గౌడ్, గోవర్ధన్‌గౌడ్, శ్రీనివాసుగౌడ్ పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో చదవాలి

ఎంపీపీ సుకన్య



విద్యార్థినులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ సుకన్య

యాచారం: విద్యార్థినులు ఉన్నత లక్ష్యంతో కష్టపడి చదవాలని ఎంపీపీ సుకన్య సూచించారు. మండల కేంద్రంలోని బీసీ బాలికల వసతి గృహం విద్యార్థినులకు శనివారం నోటు పుస్తకాలు, ప్లేట్లు, గ్లాసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు కష్టపడి చదివి మంచి ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. ఉన్నత చదువుల ద్వారానే కుటుంబాల్లో మంచి గుర్తింపు వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, వార్డెన్ సరిత, పంచాయతీ కార్యదర్శి తిరుపతయ్య ఉన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేష్టం

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరళాదేవి



తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తున్న సరళాదేవి

కడ్తాల్: తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్టమని, రోగ నిరోధక శక్తి అధికంగా ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరళాదేవి అన్నారు. శనివారం ఎక్వాయిపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సరళాదేవి వివరించారు. శిశువులకు తల్లిపాలు అమృత తుల్యమైనవని పేర్కొన్నారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుగుణ, నాయకులు సాయిలు, అంగన్‌వాడీ టీచర్లు సుగుణమ్మ, లీలావతి, పద్మ, మహిళలు పాల్గొన్నారు.

మంచాల తహసీల్దార్‌గా నవీన్



తహసీల్దార్ నవీన్‌ను సన్మానించిన నరేందర్‌రెడ్డి తదితరులు

మంచాల: మంచాల నూతన తహసీల్దార్‌గా నవీన్ శనివారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ అనితను హైదరాబాద్‌కు బదిలీ చేశారు. ఆమె స్థానంలో మంచాల తహసీల్దార్‌గా నవీన్ వచ్చారు. నవీన్‌ను మంచాల మండల ఎంపీటీసీ సభ్యుల ఫోరం మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, జయనందం, మండల కో–ఆప్షన్ సభ్యుడు వాజిద్ శాలువా కప్పి సన్మానం చేశారు.

ఏసీపీకి సన్మానం



ఏసీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న స్రవంతి

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన కే శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ చంద్రకళను మున్సిపల్ చైర్ పర్సన్ కప్పరి స్రవంతి కలిశారు. ఈ సందర్భంగా వారిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మహేశ్‌గౌడ్, జగదీశ్‌యాదవ్, చందు, జంగయ్య, మహేశ్, భూషణ్, వంశీ, మురళీ పాల్గొన్నారు.

మూత‘బడి’తున్నాయ్..!

- ఫలితమివ్వని ‘బడిబాట’ ప్రచారం
- ప్రైవేటు పాఠశాలల్లో జోరుగా ప్రవేశాలు
- కొరవడిన చిత్తశుద్ధి
- మూతపడుతున్న సర్కారు బడులు.. ఆందోళనలో తల్లిదండ్రులు



ఎల్లమ్మ తండాలో మూతపడిన ప్రాథమిక పాఠశాల

మంచాల: ఓ వైపు ప్రభుత్వం సర్కార్ బడులను అన్ని రకాల సదుపాయాలతో అభివద్ధి చేస్తున్నామని గొప్పలు చెబుతోంది. మరోవైపు గ్రామాల్లో మూతబడుతున్న ప్రభుత్వ బడుల సంఖ్య పెరుగుతోంది. దీంతో భవిష్యత్‌లో గ్రామాల్లో సర్కార్ బడులు కనుమరుగవుతాయనే భయందోళన ప్రజల్లో మొదలైంది. ఐదేళ్ల క్రితం మంచాల మండలంలో 26 ప్రాథమిక పాఠశాలలు, 8 ప్రాథమికోన్నత పాఠశాలలు, 10 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు. మొత్తం 44 పాఠశాలలు ఉండేవి. నేడు 19 ప్రాథమిక పాఠశాలలు, 8 ప్రాథమికోన్నత పాఠశాలలు, 10 ఉన్నత పాఠశాలలు కలిపి 37 పాఠశాలలు మాత్రమే ఉన్నాయి. గడిచిన నాలుగేళ్లలో 7 ప్రాథమిక పాఠశాలలు, ఒక్క ఉన్నత పాఠశాల మూతపడ్డాయి. పదేళ్ల క్రితమే ఆంబోత్ తండా ప్రాథమిక పాఠశాల, మూడేళ్ల క్రితం కొర్రం తండా, సత్తి తండా, బుగ్గ తండా, ఆరుట్ల బాలికల ఉన్నత పాఠశాలలను మూసేశారు. ఈ ఏడాది ఎల్లమ్మ తండా, మనోహరబాద్, ఆరుట్ల ఉర్దు ప్రాథమిక పాఠశాలలను రద్దుచేశారు. ఇలా ఏడు గ్రామాల్లో ఎనిమిది ప్రభుత్వ పాఠశాలలు మూసేశారు.

ప్రధాన కారణం

ప్రభుత్వ పాఠశాలల ఏర్పాటుకు పెద్దలు చాలా కష్టపడ్డారు. మా గ్రామంలో బడి లేదు. మా పిల్లల భవిష్యత్ అందకారం అవుతుందని ఆందోళనలు చేసి గ్రామాల్లో బడుల ఏర్పాటుకు కృషి చేశారు. అయితే నేడు ప్రైవేటు పాఠశాలల మోజులో పడి గ్రామాల్లో ఉన్న సెర్కార్ బడులకు పిల్లలను పంపించడం మానేశారు. దీంతో పిల్లల సంఖ్య తగ్గిపోవడంతో ఉన్న బడులు మూసివేతకు గురవుతున్నాయి. దీంతో లక్షలాది రూపాయాలతో నిర్మించిన పాఠశాల భవనాలు శిథిలావ్యవస్థకు చేరుకున్నాయి.

ఆశించిన ఫలితాలు రావడం లేదు

ప్రభుత్వం ప్రతి ఏటా పాఠశాలల ప్రారంభ సయమంలో బడిబాట కార్యక్రమాన్ని పక్షం రోజులు నిర్వహించి పిల్లల సంఖ్య పెంచే ప్రయత్నం చేస్తోంది. ర్యాలీలు, గ్రామ సభలు, విద్య సదస్సులు ఇలా అనేక కార్యక్రమాలు చేపడుతున్నారు. కానీ ఆశించిన ఫలితాలు రావడం లేదు. దీంతో మారుమూల గ్రామాల్లో పాఠశాలలు మూతబడుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

చిత్తశుద్ధి లేదు



ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయడంలో ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉండాలి. ప్రభుత్వం డిజిటలైజేషన్ విద్యను అందిస్తున్నామని గొప్పలు చెప్పడం కాదు. క్షేత్ర స్థాయిలో పిల్లలు తగ్గిపోవడానికి కారణాలు గుర్తించి చర్యలు తీసుకోవాలి. ప్రతి ఏటా మూతపడే పాఠశాలల సంఖ్య పెరుగుతోంది. ఆరుట్లలోనే మూడేళ్ల క్రితం బాలికల ఉన్నత పాఠశాల, నేడు ఉర్దూ పాఠశాల మూతపడింది.

– కొంగరవిష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచ్, ఆరుట్ల

హేతుబద్ధీకరణ పేరుతో..



ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ విషయంలో ప్రభుత్వం చర్యలు ఫలించకపోవడానికి అనేక కారణాలున్నాయి. మౌలిక వసతులు లేకపోవడం, ఉపాధ్యాయుల కొరత వంటి సమస్యలు ఏళ్ల తరబడిగా పట్టి పీడిస్తున్నాయి. ప్రభుత్వం హేతుబద్ధీకరణ పేరుతో మరిన్ని పాఠశాలలను మూసి వేసే ఆలోచనలో ఉంది.

– ఏవీ సుధాకర్, ఎస్టీయూ, రాష్ట్ర అధ్యక్షుడు

జాతీయ రహదారిపై గుంతలు పూడ్చివేత

సాక్షి ఎఫెక్ట్..



జాతీయ రహదారిపై ఏర్పడిన గుంతలను బీటీ వేసి పూడుస్తున్న సిబ్బంది

అబ్దుల్లాపూర్‌మెట్: ఇటీవల కురిసిన వర్షాలకు విజయవాడ జాతీయ రహదారిపై ఇరువైపులా ఏర్పడిన గుంతలను నేషనల్ హైవే అధికారులు పూడ్చివేయిస్తున్నారు. వర్షాల కారణంగా గుంతలు ఏర్పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని జాతీయ రహదారి.. గుంతల మయం– ఇబ్బందుల్లో వాహనదారులు అనే శీర్షికతో గురువారం సాక్షి దినపత్రికలో కథనం రావడంతో స్పందించిన అధికారులు బీటీ వేసి గుంతలను పూడ్చివేయిస్తున్నారు. కథనాన్ని ప్రచురించిన సాక్షి దినపత్రికకు వాహనదారులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు షాబుద్దీన్



కడ్తాల్: పోలీసుల అదుపులో ఎన్‌ఎస్‌యూఐ నాయకులు

కడ్తాల్: అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు షాబుద్దీన్ హెచ్చరించారు. ఈ నెల 29, 30 తేదీలలో నిర్వహించే గ్రూప్–2 పరీక్షలను వాయిదా వేయాలని ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం మండల కేంద్రం నుంచి ఎన్‌ఎస్‌యూఐ నాయకులు అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్నారనే ముందస్తు సమాచారంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా షాబుద్దీన్ మాట్లాడుతూ సమస్యలపై పోరాడుతున్న నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం దారుణమన్నారు. ఈ నెల 1 నుంచి 23 వరకు గురుకుల బోర్డు పరీక్షలు, 8వ తేదీన అర్బన్ డెవలప్‌మెంట్ ఏఈ పరీక్షలు, 29, 30 తేదీలలో గ్రూప్–2 పరీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఒకే నెలలో ఇన్ని పరీక్షలు రాయడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. గ్రూప్–2 పరీక్షలను నవంబర్‌లో నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ జిల్లా నాయకులు రాజేశ్, శ్రీకాంత్, దర్శన్, మణిదీప్, పవన్, వంశీ ఉన్నారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు: గ్రూప్– 2 పరీక్షలు వాయిదా వేయాలని ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో ఆమనగల్లు పట్టణానికి చెందిన పలువురు ఆ సంఘం నాయకులను శనివారం ఉదయం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. సాయంత్రం వీరిని వ్యక్తిగత పూచికత్తుపై విడుదల చేశారు. అరెస్టైన వారిలో మండల ఎన్‌ఎస్‌యుఐ అధ్యక్షుడు ఫరీద్, నాయకులు సురేశ్ నాయక్, మహేశ్, సిద్ధూ తదితరులు ఉన్నారు.

భూసేకరణ రద్దు హర్షణీయం

సీపీఎం జిల్లా కార్యదర్శి భాస్కర్



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి భాస్కర్

యాచారం: ఫార్మాసిటీని రైతులు వ్యతిరేకిస్తున్నారని, అయినా అధికారులు భూసేకరణ చేస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి భాస్కర్ ఆరోపించారు. భూసేకరణను అడ్డుకున్న రైతులపై కేసులు పెట్టారని మండిపడ్డారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఫార్మాసిటీ వస్తే ఈ ప్రాంతం కలుషితమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. 2013 భూసేకరణ చట్టాన్ని పూర్తిగా విస్మరించారని విమర్శించారు. ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్లను హైకోర్టు రద్దు చేయడం హర్షణీయమన్నారు. రైతులకు మద్దతుగా సీపీఎం పార్టీ అండగా ఉంటుందని ప్రకటించారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు మధుసూదన్‌రెడ్డి, నర్సింహ, అంజయ్య, దంతుక పెద్దయ్య, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి

మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకుంటున్న మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: కొంగరకలాన్ గ్రామంలోని పురాతన లక్ష్మీనృసింహస్వామి అలయ అభివృద్ధికి కృషిచేస్తానని మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు శనివారం ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మహిపాల్, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లుతోపాటు పలువురు కాంగ్రెస్ నేతలు, ఆలయ నిర్వాహకులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోండి

సీపీఎం నాయకులు



తహసీల్దార్ చంద్రకళకు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నేతలు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండలం దండుమైలారం గ్రామంలోని సర్వే నంబర్ 90లో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాన్ని కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ చంద్రకళకు వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ 90 సర్వే నంబర్‌లో 10 ఎకరాల 37 గుంటల ప్రభుత్వ భూమిలో పల్లె ప్రకృతి వనం, గ్రామీణ క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, కబ్జాదారుల నుంచి భూమిని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు జగన్, లింగస్వామి, బుగ్గరాములు, రమేశ్, జంగయ్య, యాదగిరి పాల్గొన్నారు.

కేసీఆర్ సహకారంతో అభివృద్ధి

బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు అర్జున్‌రావ్



ఆమనగల్లులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అర్జున్‌రావ్, తదితరులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణ అభివృద్ధికి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ కృషి చేస్తున్నారని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు అర్జున్‌రావ్ కొనియాడారు. శనివారం బీఆర్‌ఎస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆమనగల్లు వరకు మెట్రోను పొడిగించాలని సీఎం కేసీఆర్‌ను జైపాల్‌యాదవ్ కోరారని తెలిపారు. కేసీఆర్ సహకారంతో ఆమనగల్లుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల మంజూరయ్యాయని తెలిపారు. రూ.4.5 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్, రూ.2.5 కోట్లతో ప్రభుత్వ జూనియర్ కళాశాల, రూ.1.5 కోట్లతో ప్రభుత్వ గ్రంథాలయం నిర్మిస్తున్నట్లు ఆయన వివరించారు. ఆమనగల్లు పట్టణంలో వివిధ ప్రభుత్వ డివిజన్ కార్యాలయాల ఏర్పాటుకు ఎమ్మెల్యే ప్రయత్నిస్తున్నారని, ఇప్పటికే కోర్టు, వ్యవసాయ శాఖ ఏడీ కార్యాలయం వచ్చాయని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు శంకర్, పరమేశ్, సుభాష్, రూపం వెంకట్‌రెడ్డి, పంతునాయక్, వెంకటయ్య, జంగయ్య, విజేందర్, కుమార్ పాల్గొన్నారు.

చెరువును కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదీ



స్థానికులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అనురాధ

తుర్కయంజాల్: మాసబ్ చెరువును కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ అన్నారు. స్వచ్ఛ్ మాసబ్ చెరువు కార్యక్రమంలో భాగంగా శనివారం ఆమె చెరువులో చెత్త తొలగించే పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ చెరువులో చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటామని, చెత్తను వేసిన వారికి జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ హరిత, కమిషనర్ శ్రీకాంత్, కౌన్సిలర్లు మంగమ్మ, ఐలయ్య, శ్రీలత, ఉదయశ్రీ , నాయకులు రమేశ్, శివ కుమార్, గుండ్లపల్లి ధన్‌రాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణే లక్ష్యం

తలకొండపల్లి: గాలికుంటు వ్యాధిని వంద శాతం నివారించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని పశువైద్యాధికారి డాక్టర్ శంకర్ అన్నారు. పశువులకు గాలికుంటు, నట్టల నివారణ మందులను తప్పనిసరిగా ఇవ్వాలని, మూగ జీవాల సంరక్షణలో జాగ్రత్తలు తీసుకొని ఆర్థికాభివృద్ధి చెందాలన్నారు. శనివారం మండల కేంద్రంతో పాటు, గట్టుఇప్పలపల్లిలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు, నట్టల నివారణ మందుల పంపిణీ చేశారు. శిబిరాల్లో 366 పశువులకు మందులు పంపిణీ చేసినట్లు పశువైద్యులు చెప్పారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: వర్షాకాలంలో వ్యాధుల బారినపడకుండా పశువులను రక్షించుకోవాలని సర్పంచ్ జగన్, ఎంపీటీసీ చెరుకూరి మంగరవీందర్ సూచించారు. నాగన్‌పల్లి గ్రామంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు, నట్టల మందుల పంపిణీ శిబిరాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి వచ్చిన పశువైద్యాధికారుల సలహాలు రైతులు తీసుకోవాలన్నారు. వర్షాకాలంలో పాడి పశువులను సంరక్షించుకోవాలని సూచించారు.

ఉత్తమ క్లబ్‌గా ‘ఆమనగల్లు లయన్స్’



అవార్డులు అందుకుంటున్న ఆమనగల్లు లయన్స్‌క్లబ్ సభ్యులు

ఆమనగల్లు లయన్స్‌క్లబ్‌కు 25 అవార్డులు

ఆమనగల్లు: లయన్స్‌క్లబ్ 320ఏ పరిధిలో చేపట్టిన వివిద సామాజిక కార్యక్రమాలకు గాను ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఉత్తమ క్లబ్‌గా ఎంపికై ంది. వివిధ విభాగాలలో ఆమనగల్లు లయన్స్‌క్లబ్‌కు మొత్తం 25 అవార్డులు వరించాయి. హైదరాబాద్‌లోని గ్రీన్‌లాండ్స్‌లో శనివారం జరిగిన లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320ఏ పురస్కార్ అవార్డుల కార్యక్రమంలో వివిధ లయన్స్‌క్లబ్‌లకు లయన్స్ క్లబ్ మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ జూలూరి రఘు అవార్డులు అందించారు. ఇందులో 2022–23 సంవత్సరానికి ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఉత్తమ లయన్స్‌క్లబ్‌గా నిలిచింది. అలాగే ఉత్తమ అధ్యక్షుడిగా కరుణాకర్‌రెడ్డి, కార్యదర్శిగా భాస్కర్‌రెడ్డి, కోశాధికారిగా కొండల్‌రెడ్డి, పీఆర్‌ఓగా పాష, బెస్ట్ జోన్ చైర్మన్‌గా కసిరెడ్డి రాంరెడ్డిలు అవార్డులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు నరేందర్‌రెడ్డి, చెన్నకిషన్‌రెడ్డి, రమేశ్‌బాబు, ఆమనగల్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు యాచారం వెంకటేశ్వర్లుగౌడ్, కోశాధకారి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి చేయూత

తలకొండపల్లి: అనాథ, నిరుపేద విద్యార్థులకు ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ వెంకటేష్ ఆర్థిక సహాయం అందజేస్తున్నారు. పెద్దూర్ తండాకు చెందిన కేతావత్ నవీన్ ఉన్నత విద్యను అభ్యసిస్తున్నాడు. ఇటీవల నవీన్ తండ్రి మృతిచెందాడు. దీంతో నవీన్ కుటుంబం ఆర్థికంగా చితికిపోయింది. ఎంపీటీసీ రఘునాయక్ సహకారంతో వెంకటేష్‌ను కలిసి చదువుకోవడానికి ఆర్థిక సహాయం చేయాలని కోరాడు. శనివారం రఘునాయక్ ద్వారా నవీన్‌కు రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రఘు, సింగిల్‌విండో డైరెక్టర్ శేఖర్, మండల కో ఆప్షన్ సభ్యులు ఇమ్రాన్, సాయినాయక్, రాజుకుమార్ పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి



తహసీల్దార్ చంద్రకళకు వినతిపత్రం అందజేస్తున్న బీఎస్పీ నేతలు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలోనే గురుకుల మహిళా డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని ఇబ్రహీంపట్నం తహసీల్దార్ చంద్రకళకు బీఎస్పీ, స్వేరో నేతలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ నాయకుడు చెరుకూరి రాజు మాట్లాడుతూ ఇక్కడ ఉండాల్సిన మహిళా డిగ్రీ గురుకుల కళాశాల ఘట్‌కేసర్‌లో అద్దె భవనంలో కొనసాగుతుందన్నారు. కళాశాల నిర్మాణానికి 2016లో ఇబ్రహీంపట్నం సమీపంలో 7 ఏకరాల స్థలాన్ని కేటాయించి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు భవన నిర్మాణం జరుగలేదన్నారు. ప్రభుత్వం వెంటనే భవనాన్ని నిర్మించి మహిళా గురుకుల డిగ్రీ కళాశాలను ఇక్కడికి తరలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాకేష్‌కుమార్, భరత్‌రాజ్, అభిలాష్, రాజేష్‌చౌహాన్, అనిల్, చిరంజీవి, ప్రవీణ్, అనీష్, మనికంఠలు పాల్గొన్నారు.

కార్మికులకు అండగా ఉంటాం



జీపీ కార్మికులకు మద్దతుగా దీక్షలో పాల్గొన్న నరేందర్‌రెడ్డి తదితరులు

మంచాల: గ్రామ పంచాయతీ కార్మికులకు అండగా ఉంటామని ఎంపీటీసీ సభ్యుల ఫోరం మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మంచాల మండల కార్యాలయం ఎదుట సమ్మెలో చేస్తున్న పంచాయతీ కార్మికులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల విషయంలో ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించాలని కోరారు. కార్మికుల డిమాండ్లను పరిష్కారించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్మికులకు అండగా ఉంటామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మండల కో–ఆప్షన్ సభ్యుడు వాజిద్, ఎంపీటీసీ సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, సీఐటీయూ మండల కన్వీనర్ కృష్ణ , గ్రామ పంచాయతీ కార్మిక సంఘం నాయకులు ఖాజా పాష, భాస్కర్, యాదయ్య, వెంకటేశ్, రవి, సురేష్, మాధవి, సుజాత, నర్సమ్మ, రోశమ్మ పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

తలకొండపల్లి: లోక్‌సభ సభ్యత్వం కోల్పోవడానికి కారణమైన 2019 నాటి పరువునష్ట కేసులో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాహుల్‌గాంధీకి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఈ కేసులో ఆయనకు రెండేళ్లపాటు శిక్ష విధిస్తూ గుజరాత్‌లోని సూరత్ కోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు స్టే విధించింది. దీంతో అత్యున్నత నాయస్థానం తీర్పును స్వాగతిస్తున్నామని కాంగ్రెస్ అసెంబ్లీ సోషల్ మీడియా కన్వీనర్ అజీం తెలిపారు. శనివారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ రాహుల్‌పై బీజేపీ నేతలు చేసిన కుట్రలు విఫలమయ్యాయని పేర్కొన్నారు. ఆయన నివాసాన్ని ఖాళీ చేయించడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి

కడ్తాల్: కేంద్ర ప్రభుత్వం గ్రామీణ తపాల ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించడంలో ఉదాసీనంగా వ్యవహరిస్తున్న తీరునూ నిరసిస్తూ గ్రామీణ తపాల ఉద్యోగులు ఈ నెల 10న వనపర్తి డివిజన్ కార్యాలయం వద్ద చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని, ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ డివిజన్ కార్యదర్శి రవీందర్ కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ, గ్రామీణ తపాల ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, పెన్షన్ సౌకర్యం కల్పించాలని, గ్రూప్ ఇన్సూరెన్స్, గ్రాట్యుటీ రూ.5లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. కమలేశ్ చంద్ర కమిటీ సిఫార్సులను అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో డాక్ సేవక్ మధు ఉన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే న్యాయం



కాంగ్రెస్‌లో చేరిన వారికి కండువాలు కప్పుతున్న రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సూచించారు. అధికారమే లక్ష్యంగా యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని ఆయన కోరారు. ఆమనగల్లు పట్టణంలోని ఐక్యత ఫౌండేషన్ కార్యాలయంలో శనివారం యువజన కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ పాలనలోనే ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో తలకొండపల్లి మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు మహేశ్, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీరాములు, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజశేఖర్, మాడ్గుల మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దళపతిగౌడ్, నాయకులు జంగయ్యగౌడ్, శివ, భానుకిరణ్, సురేశ్‌గౌడ్, నవీన్, అభినవ్, రమేశ్, వసురాం, ఆంజనేయులు, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

ఆమనగల్లు మున్సిపాలిటీలోని 5వ వార్డుకు చెందిన యువకులు జంతుక మహేశ్, శ్రీశైలం, సురేశ్, మహేశ్, కుమార్, గోపి, ప్రవీన్, జంగయ్య, సుధాకర్ తదితరులు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌పార్టీలో చేరారు.